
## పంకజ్ అద్వానీ @ 26



దోహా : భారత బిలియర్డ్స్ దిగ్గజం పంకజ్ అద్వానీ 26వ సారి ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఫైనల్లో పంకజ్ 1000-416 స్కోరుతో స్వదేశానికే చెందిన సౌరవ్ కొఠారిని ఓడించాడు. 2005లో తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన పంకజ్ ఆ తరువాత 25సార్లు ప్రపంచ టైటిల్స్ సాధించాడు. సెమీస్‌లో పంకజ్ 900-273తో రూపేష్ షాపై, సౌరవ్ 900-756తో ధృవ్ సిత్వాలపై గెలుపొంది టైటిల్ పోరుకు చేరుకున్నారు.



## బీడబ్ల్యూఎఫ్ అవార్డు రేసులో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్(బీడబ్ల్యూఎఫ్) ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రేసులో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి నిలిచింది. ఇటీవల హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియాగేమ్స్‌లో చరిత్రాత్మక పసిడి పతకంతో పాటు పలు టోర్నీల్లో సాత్విక్, చిరాగ్ టైటిళ్లు కైవసం చేసుకున్నారు. ఇందులో కామన్వెల్త్ గేమ్స్(2022)లో స్వర్ణం, థామస్‌కప్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా టోర్నీ, ఇండోనేషియా, కొరియా, స్విస్ టోర్నీల్లో వీరిద్దరు అద్భుత ప్రదర్శన కనబరుస్తూ విజేతలుగా నిలిచారు. నవంబర్ 1, 2022 నుంచి అక్టోబర్ 31, 2023 వరకు టోర్నీ ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకుంటూ వచ్చే నెల 11న హాంగ్జౌలో బీడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్ టోర్నీ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించనున్నారు.

### అండర్-19 ప్రపంచకప్ తరలింపు

అహ్మదాబాద్ : వచ్చే యేడాది జనవరి 13-ఫిబ్రవరి 4 తేదీల మధ్య శ్రీలంకలో నిర్వహించాల్సిన అండర్-19 పురుషుల ప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికాకు తరలించాలని ఐసీసీ నిర్ణయించింది. శ్రీలంక క్రికెట్ బోర్డుపై నిషేధం విధించిన 11 రోజులకు ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది.ప్రభుత్వ అజమాయిషీ పెరిగిన నేపథ్యంలో ఐసీసీ శ్రీలంక క్రికెట్ బోర్డును నిషేధించిన విషయం తెలిసిందే.

# వన్డేలకు గడ్డుకాలం

**వచ్చే ఏడాది భారత్ ఆడేది ఆరే | టీ20లకే పెద్దపీట**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

**వన్డే ప్రపంచకప్ గ్రాండ్ సక్సెస్ అయింది! గత రికార్డులు తిరగరాస్తూ.. భారీ సంఖ్యలో అభిమానులు ప్రత్యక్షంగా, పరోక్షంగా మ్యాచ్‌లను వీక్షించారు. టీమ్ఇండియా ఆడే మ్యాచ్‌లే కాకుండా.. ఇతర దేశాల మ్యాచ్‌లు చూసేందుకు సైతం అభిమానులు పోటెత్తారు.**

**గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వరల్డ్‌కప్‌ను పన్నెండున్నర లక్షల మంది ప్రత్యక్షంగా వీక్షించారు. ఇక భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన ఫైనల్‌ను ఒక్క హాట్ స్టార్‌లోనే 5.9 కోట్ల మంది చూశారు. ఇక టీవీల్లో చూసిన వాళ్లకు లెక్కేలేదు. ఇది క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు. ఒకవేళ మ్యాచ్ హోరాహోరీగా సాగి ఉంటే ఈ సంఖ్య మరింత పెరిగి ఉండేదే!**

**టికెట్‌ల కోసం పడరాని పాట్లు.. మ్యాచ్ జరిగే నగరంలో బస చేసేందుకు నానా తంటాలు.. బ్లాక్ టికెట్ కోసం వేలకు వేలు, లక్షలకు లక్షలు వెచ్చించడం ఇలా నెల రోజులుగా ఎక్కడ చూసినా ఇలాంటి వార్తలే. అయితే నిజంగా పరిస్థితి అదేనా అంటే కచ్చితంగా ఔనని చెప్పలేం! మనదేశంలో మినహా మరెక్కడా.. వన్డేలకు భవిష్యతు కనిపించడం లేదనేది చేదు వాస్తవం!!**

జెంటిల్మన్ గేమ్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రికెట్‌లో.. సుదీర్ఘ ఫార్మాట్‌తో విసిగిపోయిన సందర్భంలో వన్డేలు పురుడు పోసుకున్నాయి. మొదట 60 ఓవర్లతో ప్రారంభమై.. కాలక్రమేణా రూపాంతరం చెందుకుంటూ.. ప్రస్తుతం ఉన్న స్థితికి చేరాయి. అయితే 'ముందు వచ్చిన చెవుల కన్నా వెనక వచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లు.. వన్డేల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన టీ20లు ప్రజాదరణలో దూసుకుపోతున్నాయి. ప్రజల జీవన విధానంలో మార్పులు రావడంతో పాటు.. 8 గంటలు వెచ్చించి వన్డే మ్యాచ్ చూసే సమయం అభిమానులకు సైతం లేకపోవడంతో రానున్న కాలంలో వన్డేల ప్రభావం తగ్గిపోవడం ఖాయమే అని పులువురు అంచనాలు వేస్తున్నారు. తాజా ప్రపంచకప్ సక్సెస్‌తో నిర్వాహకులు సైతం ఆనందంగానే ఉన్నా.. మున్ముందు మాత్రం సచిన్ టెండూల్కర్, వసీమ్ అక్రమ్ సూచనలను అమలు చేయక తప్పని పరిస్థితి కనిపిస్తున్నది.

### ఒక్క మ్యాచ్ నాలుగు ఇన్నింగ్స్‌లు

వన్డే మ్యాచ్‌లపై ఆసక్తి పెంచాలంటే.. ఇన్నింగ్స్‌ను 25 ఓవర్లకు కుదించడం మంచిదని గతంలో సచిన్ సూచించాడు. మొదట ఒక జట్టు 25 ఓవర్లు బ్యాటింగ్ చేయడం ఆ తర్వాత మరో జట్టు 25 ఓవర్లు ఆడటం.. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ రూపంలో ఇదే సీన్ రిపీట్ చేయడం ద్వారా మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెంపొందించవచ్చని మాస్టర్ సూచించాడు. మరోవైపు పాకిస్థాన్ పేస్ దిగ్గజం వసీమ్ అక్రమ్ మాత్రం వన్డేలను 50 ఓవర్ల నుంచి కుదించి 40 ఓవర్లకు తీసుకురావడం బెస్ట్ అని అభిప్రాయపడ్డాడు. ఇప్పుడు ఇన్నింగ్స్ ఆది, అంత్యాలను చూసేందుకు మాత్రమే అభిమానులు ఆసక్తి చూపుతున్నారని.. మధ్య ఓవర్లలో ఆట వాళ్లకు బోరింగ్‌గా మారిందని అందుకే మరో పది ఓవర్లు తగ్గిస్తే



బాగుటుందని అన్నాడు. అయితే స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్, జో రూట్, ప్యాట్ కమిన్స్ వంటి వాళ్ల వాదన ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నది. ఓ ప్లేయర్‌లోని నైపుణ్యం, సహనశీలత, పట్టుదల, పోరాట పటిమను పరీక్షించడంలో వన్డే ఫార్మాట్‌ను మించింది లేదని కోహ్లీ గతంలో పలుమార్లు వెల్లడించాడు.

### కేవలం వరల్డ్‌కప్‌లోనే..

దాదాపు అన్ని దేశాల బోర్డులు ఏదో ఒక లీగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. అంతర్జాతీయ క్రికెట్‌లో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల ప్రాధాన్యం తగ్గుతూ వస్తున్నది. ఇప్పటి పరిస్థితినే చూసుకుంటే.. వన్డే వరల్డ్‌కప్ ముగిసిపోవడంతో.. 2024 మొత్తంలో టీమ్ఇండియా కేవలం 6 వన్డేలు మాత్రమే ఆడనుంది. పాకిస్థాన్ అయితే వచ్చే ఏడాది నవంబర్ వరకు అసలు వన్డేల జోలికే వెళ్లడం లేదు. మరి కొన్ని దేశాలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. వన్డే వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీ వంటి టోర్నీలు ఉన్న సమయంలోనే వన్డేలు ఆడి.. మిగిలిన సమయంలో టెస్టు, టీ20 ఫార్మాట్‌లకు పరిమితం కావాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. అయితే తాజా వరల్డ్‌కప్ సక్సెస్ మాత్రం ఐసీసీలో ఫుల్ జోష్ నింపింది. క్రికెట్‌కు కేంద్రబిందువుగా ఉన్న భారత్‌లో ఈ టోర్నీ నిర్వహించడం వల్ల ఇంత విజయవంతం కాగా.. వచ్చే సారి (2027లో) దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరిగే వన్డే వరల్డ్‌కప్‌నకు ఈ స్థాయిలో ఆదరణ లభించడం కల్లే! మరోసారి వన్డే ఫార్మాట్ భవితవ్యంపై చర్చ జరిగే చాన్స్ ఉంది.

## వార్నర్‌కు విశ్రాంతి

**భారత్‌తో టీ20కు ఆసీస్ జట్టు ఇదే**

మెల్‌బోర్న్: టీమ్ఇండియాతో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నుంచి ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు విశ్రాంతినిచ్చారు. ఇటీవల ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో ఆసీస్ తరఫున అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన వార్నర్ పొట్టి సిరీస్ ఆడకుండానే స్వదేశానికి వెళ్లనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా మంగళవారం వెల్లడించింది. అతడి స్థానంలో ఆరోన్ హార్డీ జట్టుతో చేరాడు. వరల్డ్‌కప్ ఆడిన జట్టు నుంచి ఏడుగురు ప్లేయర్లు ఈ సిరీస్‌లో పాల్గొననుండగా.. మాథ్యూ వేడ్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ఇప్పటికే ఈ సిరీస్ కోసం సూర్యకుమార్ కెప్టెన్సీలో టీమ్ఇండియా జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే.

**ఆస్ట్రేలియా జట్టు:** వేడ్ (కెప్టెన్), హార్డీ, బెహ్రెన్‌డార్ఫ్, అబాట్, టిమ్ డేవిడ్, ఎలీస్, హెడ్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, తన్వీర్ సంఘా, షార్ట్, స్మిత్, స్టొయినిస్, రిచర్డ్‌సన్, జాంపా.



## రెండో రౌండ్‌కు ప్రణయ్



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ లో భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్.ప్రణయ్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో 31 ఏళ్ల ప్రణయ్ 21-18, 22-20 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన చౌ తీన్ చెన్‌పై గెలుపొందాడు. వెన్ను నొప్పి కారణంగా గత రెండు టోర్నీలకు గైర్హాజరైన ప్రణయ్ విజయంకోసం రెండు గేమ్‌లలో తీవ్రంగా శ్రమించాడు. పలుమార్లు వెనుకంజలో ఉన్నప్పటికీ పుంజుకుని విజయం సాధించాడు. భారత పురుషుల జోడి సాత్విక్-చిరాగ్ జోడికూడా ముందంజ వేసింది. సాత్విక్-చిరాగ్ 21-13, 21-10తో ఇగ్లండ్‌కు చెందిన బెన్ లేన్-సీన్ వెండిలపై సునాయాసంగా గెలుపొందారు. బరిలో నిలిచిన ఏకైక భారత మహిళ ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే 12-21, 14-21తో చైనాకు చెందిన జాంగ్ యిమన్ చేతిలో ఓడిపోయింది.

## ఖతార్ చేతిలో ఓటమి



దోహా : ప్రపంచకప్ ఫుట్‌బాల్ ఆసియా క్వాలిఫయింగ్ పోటీలలో భాగంగా మంగళవారం ఖతార్‌తో జరిగిన పోరులో భారత జట్టు 0-3తో ఓడిపోయింది. ఆట ఆరంభమైన నాలుగో నిమిషంలోనే ముస్తఫా ఖతార్‌కు ఆధిక్యం అందించాడు. ఆపై విరామం వరకు మరో గోల్ కాకుండా భారత డిఫెండర్లు ప్రత్యర్థిని అడ్డుకున్నారు. ద్వితీయార్థం 46వ నిమిషంలో మోయిజ్ అలీ చేసిన గోల్‌తో ఖతార్ స్కోరు రెట్టింపయింది. ఇక 86వ నిమిషంలో అబ్దురిశాగ్ హెడర్‌తో గోల్ పోస్ట్‌లోకి కొట్టడంతో 3-0తో ఖతార్ విజయం సాధించింది.


## బెజవాడలో ఇంగ్లండ్ క్రికెట్ టీమ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంగ్లండ్ అండర్-19 క్రికెట్ టీమ్.. విజయవాడ కనకదుర్గమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) పర్యవేక్షణలో నవంబర్ 27 వరకు అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విజయవాడకు చేరుకున్న అండర్-19 ఇంగ్లండ్ క్రికెట్ బృందంలోని సభ్యులు ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంగ్లండ్ క్రీడాకారులకు ఆలయ పాలక మండలి, ఆలయాధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరిని వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం అందజేశారు.

*భారత యువ క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. మంగళవారం కుటుంబసభ్యులు, స్నేహితుల సమక్షంలో శృతి రఘునాథన్‌తో అయ్యర్ నిశ్చితార్థం జరిగింది. తన జీవితంలో ముఖ్యమైన సందర్భాన్ని సోషల్‌మీడియా ద్వారా అభిమానులతో వెంకటేశ్ పంచుకున్నాడు.*





Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.